# గాయత్రీ మహిమ

— లేడేపల్లి భాగ్యలక్ష్మీ మాధవ్




''సూర్యాస్తమయం అవుతోంది... దూరంగా ఏదో ఊరు ఉన్నట్లుగా అక్కడక్కడ పొగ కనపడుతోంది. ఎలాగైనా దీపాలుపెట్టే వేళకి ఆ గ్రామం చేరుకోవాలనే కంగారులో మరింత త్వరగా నడవసాగాడు రామశాస్త్రి.

''వెల్రక్రితం ఉపనయన మహోత్సవానికి చెల్లెలి గారింటికి వచ్చిన వెంకటశాస్త్రి పన్నెండేళ్ళ రామశాస్త్రిని చూచి ముచ్చట పడ్డాడు. ఒక్కసారి మేనల్లుని తమ ఊరు పంపమని బావగార్కి, చెల్లెలికి చెప్పి... వెళ్ళిపోయాడు. అతిచిన్న వయసులోనే వేదమంత్రాలు కంఠతా వల్లించటమే కాకుండా... అష్టావధానం... శతావధానంలో పాల్గొని అవలీలగా సమస్యలు పూరించే రామశాస్త్రి బాలపండితుడుగా పేరుపొందాడు. శివాలయంలో మంత్రపుష్పం చదివే... ఆ చిన్నారి బాలుని కంఠంలో శ్రావ్యత... గంభీరతకి ఆ ఊరి జనం తన్మయమొందుతారు... మేనల్లునిలోని గొప్పతనాన్ని చూచిన మరుక్షణమే గ్రహించాడు వెంకటశాస్త్రి.

ఒక్కసారి తన గ్రామంలోని పండితులకు తన మేనల్లుని చూపాలనే... ఆ చిన్నారి బాలుని ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించాలనే... బావగార్కి పదేపదే చెప్పి ఒప్పించాడు.

''తత్ ఫలితమే... రామశాస్త్రి ప్రయాణం.''

''ఉదయం పది గంటల సమయంలో బయలుదేరిన అతను... మార్గమధ్యంలోని గ్రామాలు దాటుతూ... చివరకు సూర్యాస్తమయవేళ... ఓ గ్రామం చేరుకున్నాడు.''

''మరునాటి సూర్యోదయవేళకి మేనమామ గారి ఊరుచేరతాడు.''

అందుకే... ఆ రాత్రి ఆ గ్రామంలోనే విశ్రమించటానికి నిర్ణయించుకుని... త్వరత్వరగా నడిచి దీపాలవేళకి గ్రామంలో అడుగుపెట్టాడు. ఏదో తెలియని వింత తేజస్సుతో చూపరుల దృష్టిని ఆకర్షించే... ఆ బాలునికి... ఓ బ్రాహ్మణ కుటుంబం భోజనం పెట్టింది. కానీ... ముందుగానే... వారు అతనికి... భోజనం మాత్రమే తాము పెట్టగలమని... విశ్రమించటానికి వేరొకచోటు చూచుకోమనీ చెప్పారు... అలా ఎందుకు చెప్పారో... అర్థంకాకపోయినా... అడగటం భావ్యంకాదని మౌనంగా భోజనం చేశాడు రామశాస్త్రి.

అత్యంత ఆదరంతో తనకి భోజనం పెట్టిన ఆ దంపతులకు తన కృతజ్ఞతలు చెప్పుకుని... ఊరు చూద్దామని శెలవుతీసుకుని బయటకు వచ్చాడు.

ఆ దంపతుల ముఖాలు ఎందుకో భయంతో పాలిపోయాయి. ఇదేమీ గమనించని రామశాస్త్రి నిబ్బరంగా... ఆ గ్రామవీధుల్లో తిరుగుతూ... నిద్రరావటంతో... ఒక ఇంటి అరుగుమీద తన కండువా... దిండుగా అమర్చుకొని పడుకోబోయాడు.


అతని అడుగుల చప్పుడుకి తలుపు తీసి తొంగిచూసిందో ఇల్లాలు.

''రామశాస్త్రిని చూడగానే... ఆమె ముఖం పాలిపోయింది.

''ఎవరు బాబూ నీవు! ఈ గ్రామం వాడివిలా లేవే... ఇక్కడ పడుకోవటం నీకు క్షేమం కాదునాయనా! వేరే ఎక్కడయినా పడుకో... గభాలున తలుపు మూసి లోపలకు వెళ్ళిపోయిందామె.

తెల్లబోయాడు రామశాస్త్రి.

అతనికేం అర్థం కాలేదు. ఆతిథ్యం ఇచ్చిన దంపతులు విశ్రమించటానికి చోటు ఇయ్యలేదు... ఖాళీగా ఉన్న అరుగుమీద పడకుందామంటే... ఈ ఇల్లాలు... ఇలా హెచ్చరించి వెళ్ళిపోయింది...



కారణం ఏమిటి...? అసలు ఈ గ్రామంలో ఎవరూ ఆతిథ్యం తప్ప ఆశ్రయం ఇయ్యరా! కారణం ఏమిటో... ఆలోచిస్తూనే అలాగే ఆ అరుగుమీద నిద్రకొరిగిపోయాడు రామశాస్త్రి.

"ఉన్నట్లుండి అతనికి మెలకువ వచ్చింది. కారణం తెలియలేదు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

"దూరంగా మువ్వల చప్పుడూ... పిచ్చిపాటల సందడీ... వినిపించాయి... అలాగే చూస్తూండి పోయాడు.

రాను... రానూ... ఆ ధ్వని దగ్గర అయింది.

అలాగే చూస్తుండి పోయాడు రామశాస్త్రి.

"నల్లని రూపు... పర్వతాకారం... దుబ్బుతల ఎర్రగా రక్తం చిమ్ముతున్న కళ్ళు... అతి భయంకరకమైన రూపం... చేతిలోని కర్ర... నేలకి తాటిస్తున్నప్పుడల్లా... మువ్వలచప్పుడు... ఆ చప్పుడు వినపడగానే... ఇళ్ళల్లోంచి... అందరూ బయటకు వచ్చి... నమస్కారంచేసి... బెదురుగా లోపలకెళ్ళిపోతున్నారు. అతని అనుచరులు చేతిలోని కల్లుకుండలు యజమానికి అందిస్తూ... మధ్యమధ్య తాము కూడా తాగుతూ... వెర్రికేకలు పెడుతూ.. అతన్ని అనుసరిస్తున్నారు.

అడుగు... అడుగువా నేల అదరగా... రామశాస్త్రిని సమీపించాడు... దిబ్బడు...

"భయంకరమైన అతని రూపుకీ... ఆ గ్రామస్తుల వింతచర్యకీ... విస్తుపోయి అలాగే కూర్చుండిపోయాడు... రామశాస్త్రి.

"తనను చూచికూడా లేవకుండా... అలా... నిర్భీతిగా కూర్చుండి పోయిన... ఆ బాలుని వైపు ఓ విషపుచూపు చూచి... ముందుకు సాగిపోయాడా వ్యక్తి.

అతనిని అనుసరించారు అతని అనుచరులు.

"రామశాస్త్రికి ఏం అర్థంకాలేదు... ఇంతలో ఆ ఇంటి ఇల్లాలు... బయటకొచ్చి... రామశాస్త్రిని కౌగలించుకుని భోరున ఏడవసాగింది. కారణం తెలియని రామశాస్త్రి విస్తుపోయాడామె ప్రవర్తనకి.

"అమ్మా! మధురంగా పిలిచిన అతని వంక వెక్కుతూ చూచిందా ఇల్లాలు."

"ఏమిటమ్మా! ఎందుకిలా ఏడుస్తున్నారు? ఏమయింది తల్లీ!

"చూడు బాబూ! ఏ తల్లి కన్నబిడ్డవో... ఇలా మా గ్రామానికొచ్చి... అన్యాయంగా బలైపోతున్నావు... అందుకే ఇందాక నిన్ను ఇక్కడ పడుకోవద్దని హెచ్చరించాము... ఇంకా ఏమో చెప్పబోయిన ఆమెని మధ్యలోనే ఆపాడు రామశాస్త్రి."

"అసలు విషయమేమిటమ్మా! అతనెవరు? మీరందరూ ఎందుకు ఇలా అతనిని చూచి ధడుస్తున్నారు?"

"ఏం చెప్పను బాబూ! వాడు మా ఊరికి పట్టిన గ్రహణం లాంటివాడు... మహా దుర్మార్గుడు. .. పచ్చినెత్తురు తాగుతాడు... ఈ గ్రామంలోనే కాదు... చుట్టుప్రక్కల గ్రామాలలో కూడా వాడినెదిరించి బ్రతక కలవారు లేరు... వాడు నీచకులం వాడు...
ఉన్నతమైన బ్రాహ్మణ పండితులతో నమస్కారములు చేయించుకుంటూ... తానే దేముడిలాంటి వాడినని విర్రవీగుతున్నాడు... వాడి పేరు దిబ్బడు.

కర్మఖాలి ఎవరైనా వాడొచ్చినపుడు... లేచినిలబడక పోయినా... నమస్కారం చేయకపోయినా... వాడికి ఈ భూమి మీద నూకలు చెల్లినట్లే... అందుకే బాబూ! అభంశుభం తెలియని నీవు ఈ దుర్మార్గుడి కంటపడి అతని ఆగ్రహానికి గురైనావు... వాడు నిన్ను వదలడు... వలవలా ఏడ్చిందా ఇల్లాలు.

"లేదమ్మా! మీరలా బాధపడకండి! వాడేమి చేయడు... అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు... ఆయుష్షు ఒకసారే పోస్తాడమ్మా! ఎవరిచావు ఎలా రాశిపెట్టి ఉందో... భయపడకు తల్లీ... పోయి విశ్రమించండి... ఆమెను ఓదార్చి లోపలకు పంపాడు రామశాస్త్రి."

'అతనిని ఒదలలేక ఒదలలేక... లోపలకెళ్ళిపోయిందామె. ఆమె వెక్కిళ్ళు అతనికి వినిపిస్తూనే ఉన్నాయి."

నెమ్మదిగా అరుగుమీద పడుకున్నాడు... వెంటనే నిద్రలోకి జారిపోయాడు...

★ ★ ★

"తెల్లవారుఝామున మెలకువ వచ్చింది రామశాస్త్రికి అలవాటు ప్రకారంగా..."

"నెమ్మదిగా లేచి... కాలకృత్యాలు తీర్చుకోవటానికి ఆ ఊరి మధ్యలో ఉన్న చెరువు దగ్గరకు చేరాడు. అందరూ అతన్ని వింతగా బాధగా చూడసాగారు... కారణం తెలియని రామశాస్త్రి... తన పని తాను ముగించుకుని స్నానం చేసి... సంధ్యావందనం చేసుకోసాగాడు..."

ఇంతలో దూరంగా... మువ్వల చప్పుడుతో పాటు పెద్ద... పెద్దకేకలతో... కొందరు అక్కడకు వచ్చారు. వారిని చూడగానే ఎక్కడివారక్కడ భయంతో తప్పుకున్నారు... రామశాస్త్రి అలాగే... సంధ్యావందనం చేసి సంధ్య వార్చుకోవటానికి పైకి వచ్చాడు... ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు అతని ఒంటిమీద పడి మెరుస్తున్నాయి.

"ఏరా... నీకెంత పొగరు... మా దొర వస్తే... అరుగుమీద నుంచి... క్రిందికి దిగవా... అసలు నువ్వెవడివిరా... నీకు ఈ ఊరి ఆచారం తెలుసా... గీరగా అడిగాడొకడు."

అతనివంక ఓ సారి చూచి... తనపనిలో నిమగ్నమయిపోయాడు రామశాస్త్రి.

"అలా నిర్లక్ష్యంగా తమని పురుగులా చూచిన అతన్ని చూచి... వారికి ఒళ్ళుమండిపోయింది. తమ అడుగుల చప్పుడుకే ఆ గ్రామం ఒణికిపోతుంది... అలాంటిది ఓ పిల్లవాడు... ఎంత నిర్లక్ష్యంగా నిర్భీతిగా ఉన్నాడు... వారికి కోపం ముంచుకొచ్చింది..."

వెంటనే తమ చేతుల్లోని కర్రలను ఒక్కసారిగా ఆ బాలుడిమీదకి ఎత్తారు... కానీ చిత్రంగా వారి చేతులు క్రిందకి దిగలేదు.. అలా ఎత్తిన చేతులు ఎత్తినట్లే ఉండిపోయాయి...

రామశాస్త్రి తన ధ్యానంలో తను అలాగే ఉండిపోయాడు.

ఆ వింత చూచిన గ్రామస్తులు కూడా ఆశ్చర్యానందాలలో మునిగిపోయారు.

"అలా ఎంతసేపు నిలుచున్నా... తాము ఆ బాలుని ఏమీ చేయలేమని వారికి అర్థం అయిపోయింది.

ఒక్కసారిగా అందరూ తమ యజమాని దగ్గరకు పరుగెత్తారు ఆ వింత చెప్పటానికి.

"అదివిన్న దిబ్బడు... మండిపడిపోయాడు."

ఒక చిన్న బాలుడు! అర్చకుడు యాయవారం అడుక్కునే పిలక బ్రాహ్మణ కుమారుడు... తనని అవమాన పరచటమా... ఇంతవరకూ ఓటమి ఎరుగని తను...

అవమానంతో క్రుంగిపోయాడు.

వెంటనే చూరులోని కమ్మకత్తితో బయలు దేరాడు ఉగ్ర అవతారంతో.

"అందరూ అతన్ని చూచి దారి ఇచ్చారు."

"రామశాస్త్రి పూజలో నిమగ్నమయిపోయాడు..."

రామశాస్త్రిని చంపాలని వచ్చిన ఆ వ్యక్తి... అతనికి ఆమడదూరంలో ఆగిపోయాడు...

"పూజచేస్తున్న రామశాస్త్రి చుట్టూ ఓ స్త్రీ చేతిలో కత్తితో తిరుగుతోంది."

ఆమె మెడనిండా పుర్రెలు... ఎన్నో తలలు... మరెన్నో చేతులూ... అతి భీకరంగా... అతని చుట్టూ అతనికి కాపలాగా తిరుగుతున్న ఆ మహాశక్తిని చూచి... గజగజలాడిపోయాడు దిబ్బడు.

తన అనుచరులు ఆ బాలుని ఎందుకు బంధించలేక పోయారో అతనికి అర్థం అయింది... కానీ... ఆమె ఎవరూ... ఆ బాలుని చుట్టూ ఎందుకలా కాపలా కాస్తోంది... ఇంతకాలం తనకెవరూ ఎదురు లేరని... మిడిసిపడ్డాడే... చివరకు ఓ పసివాని చేతిలో ఘోర పరాజయం పొందాడు... దీనికి... కారణం... ఆ స్త్రీ... ఆమె ఎవరో తెలుసుకోవాలి...

అక్కడే చతికిలపడ్డాడు దిబ్బడు...

"రామశాస్త్రి పూజ పూర్తికాగానే నెమ్మదిగా లేచాడు... తన ఎదురుగా అలా కూర్చున్న దిబ్బడిని చూచి... అలాగే నిలుచుండిపోయాడు.

ఉన్నట్లుండి దిబ్బడు రామశాస్త్రి రెండుకాళ్లూ పట్టుకున్నాడు.

అయ్యయ్యో! అదేమిటి లేవండి! పక్కకు తప్పుకున్నాడు రామశాస్త్రి.

"నన్ను క్షమించండి! స్వామీ... అజ్ఞానంతో, అహంకారంతో నన్ను మించిన వాడులేడని విర్రవీగాను. నేను నమస్కరించి దీవనలందుకోవలసిన బ్రాహ్మణోత్తములచే నమస్కారములందుకుని పాపం మూటకట్టుకున్నాను. ఆఖరికి పసివాడివైన నిన్ను కూడా నా కసాయి కత్తికి బలిచేయాలని నిశ్చయించుకుని వచ్చాను... కానీ... కానీ... నిన్ను అనుక్షణం కాపాడుతూ... నీ చుట్టూ కాపలా కాసే ఆ మహాశక్తి ముందు నేనెంత? అసలు ఆమె ఎవరు! నీకు ఆమె ఎందుకు కాపలా కాస్తోంది? నువుచేసే పూజ ఏమిటి? ఆమెను ఎలా ప్రసన్నం చేసుకున్నావు? వివరించు స్వామీ! రెండుచేతులూ జోడించాడు దిబ్బడు.

"రామశాస్త్రి చిరునవ్వు నవ్వాడు."

చూడండి! నాకేమీ తెలియదు... నేను పెద్ద పండితుడను... భక్తుడను కూడా కాను... కానీ నేను చేసేది మాత్రం సూర్యోదయం, సూర్యాస్తమయాలలో సంధ్యావార్చటం... గాయత్రీనామ జపం చేయటం... అంతే...

"గాయత్రీనామం అంటే... ప్రశ్నించాడు దిబ్బడు..."

"ఉపనయన వేళలో పండితులు మంత్రోచ్చారణతో మాతా, పితలతో ఉచ్చరింపచేసి... ఉపదేశించే మంత్రమే గాయత్రి మంత్రం. దాని మహిమే ఇపుడు మీరు కళ్ళారా చూపింది..." నన్ను కాపాడింది కూడా ఆ తల్లే! వివరించాడు రామశాస్త్రి.

దిబ్బడు భక్తిగా నమస్కరించాడు.

రామశాస్త్రి మేనమామ గారి ఊరు బయలుదేరాడు. తెల్లవారుఝామునే దేవాలయంలో అర్చన చేయటానికి వచ్చిన వెంకటశాస్త్రికి అక్కడి భక్తులమాటలు విచిత్రంగా తోచాయి.

"ఎవరో పన్నెండు సంవత్సరాల బాలుడు దిబ్బడిలోని అహంకారజాడ్యాన్ని ఒదిలించటమే కాకుండా... అతి మూర్ఖుడైన అతనిలో అనుకోని మార్పు తీసుకువచ్చాడనీ... నిజంగా ఆ బాలుడు సామాన్యుడు కాడనీ... దేవి ఉపాసకుడనీ వింతగా చెప్పుకోసాగారు."

"ఉన్నట్లుండి ఉలిక్కిపడ్డాడు వెంకటశాస్త్రి."

కొంపతీసి... ఆ బాలుడు తన మేనల్లుడు కాదుకదా... ఈ ఆలోచన రాగానే... అతను క్షణకాలం వణికిపోయాడు. తాను మేనల్లుడిని ఆహ్వానించాడే కానీ... మాటవరసకైనా 'దిబ్బడు' గురించి చెప్పలేదు.... అయినా ఒంటరిగా వస్తాడని కూడా ఊహించలేదు... ఇక అతను క్షణం ఆలస్యం చేయలేదు... పూజాకార్యక్రమాలు త్వర త్వరగా ముగించుకుని ప్రక్కగ్రామానికి బయలు దేరాడు.

"మార్గమధ్యంలోనే... బాల సూర్యునిలా వెలుగుతూ... గ్రామస్థులు వెంటరాగా... దిబ్బడు అతివినయంగా దారిచూపగా... ఠీవిగా వస్తున్న రామశాస్త్రిని... దూరంనించే గమనించాడు వెంకటశాస్త్రి.

అతని హృదయం ఆనందంతో పొంగిపోయింది.

"ఎదురెళ్ళి... పసిబాలునిలా మేనల్లుణ్ని ఎత్తుకుని గుండెలకు హత్తుకున్నాడు."

ఆ దృశ్యానికి దిబ్బడితో సహా అందరి కళ్ళూ... చమరించాయి... అవి ఆనందభాష్పాలే కదా మరి. ●

